క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీలు



డాగ్‌స్క్వాడ్ సాయంతో హోటళ్లలోని గదులను తనిఖీచేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సామాజిక తనిఖీల్లో భాగంగా సోమవారం వేకువజామున పార్వతీపురం మండల పరిధిలో ఉన్న హోటళ్లలో గల గదులను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించినట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా నివారణపై దృష్టిసారించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆకస్మికంగా సిబ్బందితో కలిసి జాగిలాల సాయంతో తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టం చేశారు.

ఉపాధి పనులకు వెళ్తున్నా.. ఇవ్వని ఎన్ఎంఆర్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న లచ్చయ్యపేట గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: ఉపాధి పనులకు వెళ్తున్నప్పటికీ ఎన్ఎంఆర్ వేయడం లేదని సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రూపు సభ్యులను వేరే గ్రూప్‌లోకి వెళ్లి పని చేయాలని చెప్పి మా గ్రూప్ మేట్‌ను తొలగించారని, వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉపాధిహామీ పనులకు వెళ్తున్నామని తమకు హాజరు ఎవరు వేస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ వేతనదారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంతపోలమ్మ వారి జాతర



కంతపోలమ్మ అమ్మవారు

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలసలో సోమవారం నుంచి కంతపోలమ్మ వారి జాతర జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. చినభోగిలి-మక్కువ రహదారిలో ఉన్న బగ్గందొరవలసలో అమ్మవారి జాతర నిర్వహిస్తున్న సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. సోమవారం నుంచి బుధవారం వరకూ నిర్వహించే జాతరను పురస్కరించుకుని రాత్రిపూట వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం, మంగళవారం రాత్రివేళలో ఘటాలతో తిరువీధి ఉంటుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శివారు ప్రాంతంలో గల రాష్ట్రీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా గంజాయి, సారా, మాదక ద్రవ్యాలను రవాణా చేసినా, విక్రయాలు చేసినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ గోపాలరావు నాయుడు ప్రకటించారు. శ్యామలాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో విద్యుత్ పనుల్లో భాగంగా 11కేవీ టౌన్-1,11 కేవీ శివాయలం రోడ్డు ఫీడర్ల పరిధిలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆ ఊరికి మేము వెళ్లం..!

- గ్రామంలో ఏమవుతున్నా పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదులున్నా స్పందన శూన్యం

బలిజిపేట: అనగనగా బలిజిపేట మండలంలో ఒక గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఏం జరుగుతున్నా అధికారులు పట్టించుకోరు. అక్కడి పరిస్థితులను పర్యవేక్షించాలన్నా సిబ్బంది చొరవ చూపరు. ఇంకా అవసరం అయితే అక్కడికి ఎవరినైనా ఇన్‌చార్జ్‌గా నియమించి అధికారులు పంపించినా వారు అక్కడికి వెళ్లరు. ఇంతకీ ఎందుకిలా జరుగుతోందంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇలా అధికారులు పట్టించుకోని గ్రామం పేరు నారాయణపురం. గ్రామంలోని వీధులన్నీ దుర్గంధభరితంగా కనిపిస్తున్నాయి, వీధికాలువలు మురుగునీటితో నిండిపోయి ఉన్నాయి. ఇరుకైన రోడ్లు, రోడ్డు పక్కనే ఉన్న స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోరు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల నుంచి నోటీసులు స్థానిక అధికారులకు అందినా..వారి నెత్తిమీద ఉన్న భారాన్ని దిగువస్థాయి సిబ్బందిపై తోసేసి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి. దీంతో సిబ్బంది అక్కడికి వెళ్లేందుకు నిరాకరిస్తారు. ఫిర్యాదులను అధికారులు పట్టించుకోరు. ఆ గ్రామంలో శివాలయానికి వెళ్లే రహదారిలో సిమెంట్ రోడ్డు పక్కనే ఉన్న స్థలాన్ని జి.సింహాద్రినాయుడు ఆక్రమించి పాకవేసేందుకు సిద్ధమవుతున్నాడు. రోడ్డు వెడల్పు చేయాలంటే అడ్డంకిగా ఉందని, వీధి కాలువ నిర్మాణం చేపడతాం పాకను తొలగించాలని గ్రామస్తులు చెబుతున్నా పట్టించుకోకుండా పాక వేస్తుండడంతో స్థానికులు తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదులు చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అక్కడినుంచి వారు మండల స్థాయి అధికారులకు పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కళ్ల ఎదుటే పరిస్థితులు దారుణంగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో జరుగుతున్న అక్రమాలను అధికారులే అడ్డుకోకపోతే ఇంతకన్నా దారుణమైన పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలుంటాయని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.



నారాయణపురం గ్రామం



రోడ్డు పక్కన స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న పాక



దుర్గంధభరితంగా ఉన్న వీధికాలువ

సెలవులో గ్రామ కార్యదర్శి

గ్రామ కార్యదర్శి గౌరీశ్వరరావుకు గతనెల 11వ తేదీన ప్రమాదం సంభవించగా సెలవులో ఉన్నారు. దీంతో పదమాయవలస కార్యదర్శి మోహనరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆయన నిరాకరించారు. కొంతకాలం తరువాత పెద్దింపేట కార్యదర్శి పోలినాయుడికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వగా ఆయన కూడా నిరాకరించడంతో అక్కడ కార్యదర్శి ఎవరూ అందుబాటులో లేరు. అధికారుల చేతకానితనమో, గ్రామంలో పరిస్థితులో తెలియదు కానీ గ్రామ కార్యదర్శి అందుబాటులో లేరు. దీంతో వీధులు దుర్గంధభరితంగా మారడం, ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సర్వేలు నిర్వహించడంలో వెనుకంజలో ఉండడంతో కొంతమంది సచివాలయ సిబ్బందిని తీసుకువెళ్లి ఆదరాబాదరాగా సర్వేలను నిర్వహించారు.

గ్రామ కార్యదర్శిని నియమించి అప్పగిస్తాం

గ్రామ కార్యదర్శిగా ఎవరో ఒకరికి బాధ్యతలు అప్పగించి వారితో ఆ గ్రామంలోని పరిస్థితులు చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినా నిరాకరించిన వారిపై ఉన్నతాధికారులకు సమాచారం పంపించనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

రేవటిగూడ గ్రామస్తుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రేవటిగూడ గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని పెదమరికి పంచాయతీకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని బందుగాం బ్లాక్‌కు చెందిన కొండపై ఉన్న రేవటిగూడ అనే గిరిజన గ్రామంలో మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ గ్రామాన్ని ఆంధ్రాలో ఉన్న పెదమరికి పంచాయతీలో కలిపి తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రేవటిగూడ గ్రామస్తులు సోమవారం గ్రామంలో నిరసన తెలియజేశారు.

ఎన్నిమార్లు సంబంధిత అధికారుల వద్ద విన్నవించుకున్నా వారి గోడును వినేవారే కరువయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పి.రాము మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు స్పందించి రేవటిగూడ గ్రామాన్ని పెదమరికి పంచాయతీలో కలిపి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

సెలవుపై ఎంపీడీఓ

సీతానగరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. త్రివిక్రమరావు బెంగళూరులో బంధువుల ఇంట్లో శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు సెలవుపై వెళ్లారు. మండల పరిషత్‌లో తెలుసుకున్న సమాచారం మేరకు త్రివిక్రమరావు ముందుగా వారం రోజులు సెలవుపై పెట్టి వెళ్లి..మరోవారం రోజులు సెలవును పొడిగించి బెంగళూరు వెళ్లినట్లు తెలియవచ్చింది. ఇప్పటికే సీనియర్ సహాయకుడి పోస్టు ఖాళీకావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా అధికార సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

మున్సిపాలిటీపై దృష్టి సారించండి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతతో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పార్వతీపురం మున్సిపాలిటీ పరిపాలనపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదని, అలాగే బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. దీంతో పార్వతీపురం మున్సిపాలిటీలో ఆర్థికపరమైన అభివృద్ధి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు ఇటీవల పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయని గుర్తు చేశారు. వారిద్దరి మధ్య సమన్వయలోపంతో మున్సిపల్ పాలనకు ఇబ్బందిగా ఉంటుందని, మున్సిపాలిటీలో పాలన సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తగుచర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు.



డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దుక్కి దున్నితే భూమికి సారం

- చీడపీడల నివారణకు వేసవి దుక్కులు



చినబొండపల్లిలో వేసవి దుక్కి చేస్తున్న రైతు

పార్వతీపురం: మండే ఎండను సైతం పండేపంటకు ఉపయోగించుకోవచ్చు. ఖాళీగా వదిలిస్తే భూమి నిస్సారంగా తయారవుతుంది. మరి కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ రాబోతోంది. ఈ సమయంలో రైతులందరూ ఏ పంట వేస్తే బాగుంటుంది, ఏ సమయంలో ఏ రకం విత్తనాలు ఎంచుకోవాలి, ఏఏ ఎరువులు సిద్ధం చేసుకోవాలనే అంశాలను ఆలోచిస్తుంటారు. రాబోయే పంటల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు చేస్తుంటారు. వాటన్నింటికంటే ముందు వేసవిలో పంట పొలాలను ఖాళీగా వదిలేయకుండా లోతు దుక్కి చేయడం వల్ల పంటలు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.

దుక్కితో ప్రయోజనాలు

రైతులు వేసవిలో భూ సార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి చర్యలు చేపట్టడం వల్ల ఖరీఫ్‌లో మంచి దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది.

- సాగు చేయబోయే పంటకోసం సాధారణంగా 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దుక్కులు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- వాల్‌కు అడ్డంగా దుక్కు చేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా తేమ పెరగడమే కాకుండా ఎక్కువ కాలం తేమ పంట పొలంలో ఉంటుంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పంటపొలంలో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకుపోతాయి. దీనివల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. భూమి గుల్లగా మారి వర్షపునీరు సమృద్ధిగా భూమిలో ఎక్కువ కాలం ఉంటుంది.
- ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది.
- పంటకాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండ వేడికి చనిపోయి వచ్చే సీజన్‌లో పురుగుల బెడద తగ్గుతుంది.

విధులపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి

- ఈఓపీఆర్‌డీకి కార్యదర్శుల వినతిపత్రం



ఈఓపీఆర్‌డీ పుష్పారావుకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

బలిజిపేట: ఈనెల 2వ తేదీన జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక పంచాయతీ కార్యదర్శుల విధివిధానాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బలిజిపేట మండల పంచాయతీ కార్యదర్శులు ఈఓపీఆర్‌డీ పుష్పారావుకు వినతిపత్రం అందజేశారు. జీఓఎంఎస్ నంబర్ 110ప్రకారం పంచాయతీ కార్యదర్శిని సచివాలయానికి కన్వీనర్‌గా, డీడీఓగా నియమించారన్నారు. దీనికి భిన్నంగా జాయింట్ కలెక్టర్ శోభిక వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయాలకు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సచివాలయ హెడ్‌గా ప్రభుత్వం గుర్తించలేదని, సచివాలయ సిబ్బందితో మీరు సమానమని, మీకు ఎటువంటి పర్యవేక్షణ అధికారాలు లేవని, సచివాలయంలో ఎవరికో ఒకరికి బాధ్యతలు ఇవ్వాలి కనుక మీకు డీడీఓగా ఇచ్చారన్నారు. కనుక మీరు జీతాలు పెట్టేవరకు మాత్రమే బాధ్యత అని వ్యాఖ్యానించడం, సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయం పరిధి దాటి వెళ్లినా పంచాయితీ కార్యదర్శి అడగడానికి అధికారం లేదని చెప్పారన్నారు. దీనివల్ల పరిపాలన, సకాలంలో నివేదికలు సమర్పించేందుకు అనుకూల పరిస్థితులు కొరవడే అవకాశాలున్నందున సచివాలయంలో కార్యదర్శులు నిర్వహించాల్సిన విధులపై స్పష్టమైన ఉత్తర్వులను రాతపూర్వకంగా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు రూరల్: గ్రామ కార్యదర్శుల విధివిధానాల విషయంలో స్పష్టత ఇవ్వాలని సాలూరు ఎంపీడీఓ పార్వతికి పలువురు గ్రామకార్యదర్శులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ నె 2వ తేదీన గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జిల్లా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామకార్యదర్శుల విధివిధానాలపై వ్యాఖ్యలు చేయడంతో నొచ్చుకున్నారు. తమ విధివిధానాలపై స్పష్టత ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.



సాలూరు: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామకార్యదర్శులు

సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యం



రైతుసేవాకేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీమాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్)వల్ల ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు భూమికి లభిస్తాయంటూ ఎంసీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతిరావులు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండలంలోని సుభద్ర రైతు సేవా కేంద్రంలో రైతులకు సోమవారం అవగాహన కల్పించి కిట్లు పంపిణీ చేశారు. ప్రధాన పంటకు ముందు సుమారు 30రకాలు ఎకరాకు 12కిలోల వంతున విత్తనాలు జల్లుకుని 40రోజుల తరువాత వాటిని భూమిలో కలియదున్నడం చేయాలని సూచించారు. దీనివల్ల రైతుకు, భూమికి, పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి ప్రయోజనం సమకూరుతుందని, పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరిగి భూమి గుల్లబారుతుందని వివరించారు. నీటి ఎద్దడినుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- ఎంపీపీ బి.ప్రమీల



రైతు రామారావును సన్మానిస్తున్న ఎంపీపీ బి.ప్రమీల, వ్యవసాయ సిబ్బంది

పాచిపెంట: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ఎంపీపీ బి.ప్రమీల అన్నారు. ఈ మేరకు స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసిన రోజే ప్రకృతి వ్యవసాయం విజయవంతమవుతుందన్నారు. ఉద్యోగులు ఎంత శ్రమ పడుతున్నా ప్రకృతి వ్యవసాయపరంగా రైతులలో స్పందన తక్కువగా ఉందని దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే గ్రామస్థాయి ప్రణాళికలు అవసరమని రాబోయే రోజులలో ప్రజా ప్రతినిధులను అందరినీ సమన్వయం చేసుకుని ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సాగులో విజయవంతమైన రైతు గునాపు రామారావును ఎంపీపీ, వ్యవసాయ సిబ్బంది దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దండి ఏడుకొండలు, పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ నాయకులు ముఖి సూర్యనారాయణ వెలుగు సీసీ రామకష్ణ, వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

శ్యామలాంబ పండగను విజయవంతం చేయాలి

- మంత్రి సంధ్యారాణి
- అధికారుల తీరుపై ఆగ్రహం



మున్సిపాలిటీలో పనులపై డీఈ ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు:

పట్టణంలో ఈ నెల 18,19,20 తేదీల్లో జరగనున్న శ్యామలాంబ అమ్మవారి పండగను విజయవంతం చేయాలని స్త్రీశిశుసంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. అమ్మవారి పండగ ఏర్పాట్లుపై ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ శోభిక ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, అధికారులతో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. శాఖల వారిగా పండగ ఏర్పాట్లపై ఆరా తీశారు. పండగకు పదిరోజులుండగా నేటికి పనులు చేపట్టకపోవడంపై మున్సిపల్ డీఈ ప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి నెలలో నిధులు వస్తే నేటి వరకు ఎందుకు టెండర్ ప్రక్రియ పూర్తికాలేదని, ఇంకెప్పుడు పనులు చేస్తారని మండిపడ్డారు. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తన మాట వినడం లేదని, దీనివల్ల పలుమార్లు ఉన్నతాధికారుల నుంచి మందలింపులకు గురయ్యానని కమిషనర్ కృష్ణారావు తెలపగా అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ సిబ్బంది పనితీరు బాగోవడం లేదని తాను ఆ విషయాన్ని గమనించానని మంత్రి అన్నారు.

మద్యం దుకాణాలు మూసివేయాలి

శాంతిభద్రతలు, ట్రాఫిక్‌పై పోలీసులు మాట్లాడుతూ, 20,21 తేదీల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని లేకుంటే తాగిన మత్తులో గొడవలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ, మద్యం దుకాణాలు మూసివేసినా సారా వచ్చే ప్రమాదముందని తెలిపారు.

వాటిని ఎందుకు నియంత్రించలేరని ఎక్సైజ్ అధికారులను మంత్రి ప్రశ్నించారు. పండుగకు ఎన్ని బస్సులు నడుపుతున్నారనే అంశంపై ఆర్టీసీ అధికారులు ఇచ్చిన సమాధానాలపై మంత్రి సంధ్యారాణి అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని వివరాలతో రావాలని ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై ఆరా తీశారు. పండగ ఏర్పాట్లు పక్కాగా జరుగకుంటే సంబంధిత అధికారులపై తీవ్రమైన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత..ఆదమరిస్తే చింత



ఎమ్మార్‌నగరం గ్రామం ప్రారంభంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో చేరిన వర్షపు నీరు



చినబొండపల్లి గ్రామ సమీపంలో జంఝావతి కాలువ వంతెనపై ఏర్పడిన గుంతలు



వెంకంపేట గ్రామంలో మలుపు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు



వెంకంపేట గోరీల జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలో ఇరుక్కున్న లారీ

మండలంలోని రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయి. రోడ్డు మధ్యలో గుంత ఏర్పడడంతో వాహనదారులు ఆదమరిస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి ఎక్కడ ఏ గుంత ఎంత పరిమాణంలో ఉందో అంచనా లేని స్థితిలో భారీ వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

– పార్వతీపురం రూరల్